బుర్ర రాములు

# తొవ్వ కోసం



రెండవ వారం

(గతసంచిక తరువాయి)


అయ్యో ఏందయ్యా.. గట్ల నిలబడ్డవు?" అని తొక్కబడ్డ పొలాన్ని చూస్తూ నిలబడ్డ గట్టయ్యను ఊపుతూ అంది ఎల్లమ్మ. దశమ చంద్రుని వెన్నెల్లో వంగిన పొలం, తెగిన కంకులు, రాలిన గింజలు మనస్సును గుంజినయి. ఎల్లమ్మ గుండె బావురువుంది.

అయ్యో.. అయ్యో.. నేను ముందే మొత్తుకున్నా ఈ తగాదా వద్దంటిని గదయ్యో... ఆ తొవ్వ పాడుగాను.. దాన్ని గిట్లనే వుండనియ్యంటే ఇనక పోతివి.. ఇవుడు పంటంత నాశనమైంది గదా!.. వాళ్లుడ 'అన్న'లోకదా! నా రెక్కల కట్టం నాశనం చెయ్యడానికి వాళ్ళు చేతులెట్లొచెచ. భూమంతా ఒక చెక్కగా వుండాలని నువ్వు తొవ్వ బందు చేస్తే, వాళ్ళు నా రెక్కల కట్టం నాశనం జేసిరి! ఇవ్వడు బాంకోల్లకు అప్పు ఏడనుండి తీరువుతము.. వాళ్ళ పంట కోసినంకనన్నా తొవ్వేసుకుంటేంది.. వాళ్ళకు ఏం మునుచుకొచ్చింది.. వాలిండ్ల పీనుగెల్ల..." ఎల్లమ్మ ఏడువు ఆపకుండా తిడుతూనే వుంది. ఇదేమీ పట్టించుకోకుండానే గట్టయ్య వచ్చినంత వేగంగా వెనక్కి వెళ్ళాడు.

ఎల్లమ్మ ఏడుస్తూనే గట్టయ్య వెనకే ఇల్లు చేరింది. అప్పటికి లూనా స్టార్ట్ చేసుకుని చిట్యాల వైపుకు పోయిండు గట్టయ్య. ఎల్లమ్మ ఏడుపుకు బూర్నపల్లి ఉలికి పడి లేచింది. విషయం తెలుసుకుని అందరూ పొలం దగ్గరకు పోయి చూస్తున్నారు.

ఉదయం ఆరు గంటలు దాటింది. బూర్నపల్లి ప్రజలు అందరూ పొలం దగ్గరకు వెళ్ళి చూచి తిరిగివచ్చి ఎల్లమ్మను ఓదార్చుతూ వున్నారు. ఆడవాళ్ళు, మొగవాళ్ళు, పిల్లలు అందరూ గట్టయ్య ఇంటిముందే నిలబడి వున్నారు. గట్టయ్య లేడు. ఇంటి పనులు చేయాలని ఎవరికీ అనిపించడం లేదు.

వెంకట్రావుపల్లె గ్రామ ప్రజలు ఎవరిండ్లలో వాళ్ళు కూర్చుని చెవులు కొరుక్కుంటున్నారు. తెల్లవారక ముందే ఇంటిపనులు ముగించి ఆడవాళ్ళు ఇండ్లలో గడియలు పెట్టుకుని వున్నారు. గ్రామాల్లో వుదయం వుండే పశువుల సందడి ఆనాదు లేదు. ఎప్పుడు ఏమి జరుగుతుందోననే భయంతో రెండు వెలల నుండి తొవ్వ గురించి ఘటనల మంచి చెడుల్ని అంచనా వేసుకుంటున్నారు. తొవ్వ పంచాయతీ గురించి రామయ్య, గట్టయ్యల పాత్ర చర్చించబడుతున్నది. అన్నల జోక్యం వలన ఏర్పడ్డ పరిస్థితులు చర్చిస్తున్నారు. దూరంగా జీపు చప్పుడు వినబడడంతో ఒకరిద్దరు దారిలో వున్న వాళ్ళు కూడా ఇండ్లల్లోకి వెళ్ళారు.





చిట్యాల నుండి వెంకట్రావుపల్లికి ఈమధ్యనే ప్రపంచ బ్యాంకు యిచ్చిన అప్పుతో రోడ్డు వేసింది ప్రభుత్వం. తొవ్వ పంచాయతీ మొదలైనప్పటి నుండి ఆ వూరికి పోలీసుల భాట పడ్డదన్ని రామయ్య, గట్టయ్య అంటె పడనివాళ్ళు అంటూనే వున్నారు. ఈ రెండు నెలలలో పోలీసు జీపులు ఊరికి రాని రోజులను రెండు చేతులతో లెక్కకట్టవచ్చు. వచ్చిన ప్రతిసారి లిస్టు చదవడం హెచ్చరికలు చేయడం, ప్రతి ఇల్లూ సోదా చేయడం, విలువైన వస్తువులు, డబ్బులు ఎత్తుకు పోవడం మామూలు అయింది.

వచ్చింది ఒక జీపు మాత్రమే కాదు. ఒక వ్యాను, నాలుగు సైకిల్ మోటార్లు, ఒకదాని వెనక ఒకటి వచ్చి రెండు గ్రామాలకు దారులు వేరయ్యే చోట ఆగాయి. జీపులోనుండి డి.ఎస్.పి, సి.ఐలు దిగారు. సైకిల్ మోటార్లపై వచ్చిన నలుగురు ఎస్.ఐలు, వీళ్ళందరినీ వెంబడిస్తూ గన్‌మేన్‌లు వున్నారు. వాళ్ళ చేతుల్లో ఎ.కె47లు. వ్యాననుండి 303 లు పట్టుకుని బిలబిలమంటూ జవానులు దిగారు. వీళ్ళందరూ నలుగురు ఎస్.ఐల నాయకత్వంలో నాలుగు జట్లుగా విడిపోయి రెండు గ్రామాలకు రెండు దళాల చొప్పున వెళ్ళిపోయారు. డి.ఎస్.పి, సి.ఐలు ఏదో మాట్లాడుకుంటున్నారు. గ్రామంలోపలకి వెళ్ళిన దళాలు ప్రతి ఇంటిలోకి వెళ్ళి మగవాళ్ళను బయటకు రమ్మనమని బలవంతపెట్టారు. మాట వినకుంటే తుపాకీ మడమతో బాదుతున్నారు. ఇండ్లలో వున్న సామానును అక్కరకు రాకుండా చేస్తున్నారు. ఫ్యాన్లు, టీవీలు, రేడియోలు విరిగిపోతున్నాయి. ఇంటి తలుపులు విరిగి పోతున్నాయి. బస్తాలలో వున్న బియ్యం, ఇతర ధాన్యాలు నేలపాలవుతున్నాయి. విలువైన వస్తువులు, నగలు, డబ్బు జేబుల్లోకి పోతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే బందిపోట్లు గ్రామంపైబడి దోచుకుంటున్నట్టుగా పోలీసులు వెంకట్రావుపల్లిని దోస్తున్నారు. ఇండ్లలో వున్న మగవాళ్ళందరినీ డిఎస్‌పి, సిఐలు కూర్చున్న చోటుకు వెళ్లమని కొట్టి పంపిస్తున్నారు. ఊరు మొత్తం గగ్గోలుగా వుంది. ఆడవాళ్ళ ఏడుపులు, పెడబొబ్బలు, పోలీసుల తిట్లు, ధ్వంసం.



అరగంట గడిచేసరికి వెంకట్రావుపల్లి, బూర్నపల్లిలలో వున్న ప్రతి మగవాడు డివిస్పి, సిఐల ముందుకు రుడ్చబడ్డాడు. ప్రజలతో పాటు సర్పంచి రామయ్య కూడా వున్నాడు. లూనా తీసుకుని రాత్రి వెళ్లిపోయిన గట్టయ్య ఇంకా రాలేదు.

"సార్ అన్ని ఇండ్లు వెతికాము. అందరినీ తీసుకొచ్చాము" అని ఎస్.ఐ రిపోర్టు చేశాడు.

డివిస్పి, సిఐ వైపు చూశాడు. ఆ చూపు అర్థంతెలిసిన సి.ఐ 'అరె ఓ బాడుకావుల్లారా! మీకు ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి లేదురా! నక్సలైట్లకు ఊళ్ళకు రానివ్వద్దని ఎన్నిసార్లు చెప్పినా ఖాతర్ చేయలేదేమిట్రా. అరె ఓ సర్పంచుగా నక్రాల్ చేస్తున్నావా? నువ్వు సర్పంచువైతే మాకో లెక్కా? నువు అన్నగాళ్ళను ఎందుకు పిలిపించుకున్నవు? బూర్నపల్లి సర్పంచు పొలాన్ని ఎందుకు తొక్కించినవు?"

"నాకు తెల్వదు సార్. నేను పిలిపియ్యలేదు సార్" దండం పెడుతూ సర్పంచి నసిగాడు.

'అరే లమ్డీకొడకా, తెలుసురా'

నీకంతా తెలుసు. వెంకన్న దళాన్ని తీసుకొచ్చింది నీవేరా బిడ్డా.. గట్టానికో మూరిగాని దళం, నీకేమో ఎంకని దళం.. మీ సంగతి సెబుతారా! సెబుతా!" సి.ఐ రెడ్డినోటికి ఏదొస్తే అదే కూస్తాడు.

..."లంజె కొడుకుల్లారా! నేను లిస్టు చదువుతాను... ఆ బాడుకావులందరూ ఇక్కడికొచ్చి నిలబడాలె.. అర్థమైందా"

చుట్టూ అందరినీ చూస్తూ సైగలతో సి.ఐ.రెడ్డి.
ప్రజలు మౌనంగా తలలు వంచుకుని నిలబడ్డారు.
సి.ఐ లిస్టు చదవడం మొదలు పెట్టిండు.
'పెండ్యాల రాజయ్య"..

పేరు విన్న రాజయ్య భయంగా తలవంచుకుని సిఐ చెప్పిన చోట నిలబడ్డాడు. అలాగే మిగతా వాళ్ళందరూ చేశారు.

కొండ్ర ఐలయ్య... కొండ్ర చిన్న రాజయ్య, కర్ర వెంకటయ్య, గొల్ల బుచ్చయ్య, ముంజ రామయ్య, కాసం సత్యనారాయణ రెడ్డి, కూర రాంరెడ్డి.... దాదాపు 20 మందిని పిలిచాడు. వాళ్లందరూ వరసగా నిలబడ్డారు.

"ఆ చెప్పండిరా.. మీరందరూ రైతుకూలీ సంఘం సభ్యులారా?" ఎవరు ఏమీ మాట్లాడలేదు.

"మీరంతా ఎంకన్న దళానికి అన్నం పెట్టాండ్లు. వాళ్ళకు పనులు చేసిపెట్టాండ్లు. మీ ఇండ్లల్ల మీ ఆడోళ్ళ దగ్గర పండ బెట్టాండ్లు.. ఏమంటార్రా బాడుకావులు. నేను చెప్పేది కాదంటారా?"

...వరసగా నిలబడ్డ ఆ ఇరవై మందిలో కోపం కట్టలు తెంచుకోవడానికి సిద్ధంగా వుంది. పళ్ళ బిగువున అది ఆగింది.

"అరేయ్... ఏమిరా నేనేమన్నా జవాబు లేదేమిరా!.. 'వంగండిరా.. వంగండి" అంటూ అందరినీ బలవంతంగా మెడలు వంచి వంగబెట్టాడు. సిఐ చేసిన కనుసైగతో దానికోసమే ఎదురుచూస్తున్నట్టు వున్న జవాన్లు లాఠీలతో పిర్రల మీద కొట్టడం మొదలు పెట్టారు. ఆ బాధకు లేచి నిలబడితే మోకాళ్ళపై కొట్టారు. దానికీ భరించలేక కూలబడితే వీపు మీద కొట్టారు. ఆ ప్రాంతమంతా ఇప్పటివరకు సిఐ బూతుమాటలతో నిండిపోతే ఇప్పుడు అరుపులు కేకలతో మారుమోగింది.

డి.ఎస్.పి దీనిని వినోదంగా చూస్తున్నాడు. చుట్టూ వున్న జనం భయంతో కూడిన కోపంతో చేతులు బిగుసుకుంటుండగా తమని తాము తమాయించుకుంటున్నారు. అంతకంటే ఏమీ చేయలేని మానసిక స్థితి.

బూర్నపల్లికి పోయిన పోలీసులు అక్కడ ఒక యువకుడిని బరబరా ఈడ్చుకుంటూ తీసుకు వచ్చారు. నరాసరి డివిస్పి దగ్గరకు తీసుకెళ్ళి "సార్, వీడు భాగవతలి నుండి వస్తున్నాడు. ఎక్కడి నుండి వస్తున్నావంటే మీకెందుకన్నాడు. సార్. నాలుగు తంతే ఎంపేడు నుండి వస్తున్నానని చెప్పిండు సార్!" రిపోర్టు చేసిండు జవాను.

"ఆహా! నీకెందుకు అనే మొగాడివా?"

"అరెయ్ ఎవడివిరా నువ్?.," డి.ఎస్.పి ప్రశ్న.

ఆ యువకుడు ఏమీ మాట్లాడలేదు.

డి.ఎస్.పి లేచి లాఠీ ఊపుతూ 'చెప్పరా ఎవడివి నువ్?" స్వరం పెంచి కోపంతో అరిచాడు. డివిస్పి అరుపుతో అప్పటివరకు కొట్టడంలో లీనమైన జవానులు ఆగిపోయారు. అక్కడి వాళ్ళ చూపంతా అటువైపే మళ్ళింది.

'మర్యాదగా మాట్లాండి సార్. మీరు పెద్ద ఆఫీసర్ లాగున్నారు'

ఆ జవాబు విన్న డివిస్పి, సిఐలు కోపంతో ఊగిపోయారు. ఏందిర మర్యాద.. నీకిచ్చేది.. నీ తల్లి.. అంటు పరుగున వచ్చి కాలితో డొక్కలో తన్నాడు సిఐ.



## అదృష్టం

కెనడాలోని విన్నిపెగ్ అనే ఊరికి చెందిన మేరీ గోగిక్ తన కారుని డ్రైవ్ చేస్తుండగా రోడ్డుమీదున్న ఓ చిన్న గుంటలో పడిందామె కారు. 19 అడుగుల లోతున్న ఆ గుంటలో కింద దాకా ఆ కారు వెళ్ళేంత పెద్దది కాకపోవడంతో ఆమె, ఆ కారులోని ఆమె ఇద్దరు పిల్లలు ఏడు ఏళ్ళ మార్క్, 8 ఏళ్ళ మిక్కీ పెద్ద దెబ్బలు తగలకుండా బయటపడ్డారు. ఆ విడ నష్టపరిహారం కోరుతూ విన్నీ పెగ్ రోడ్స్ డిపార్ట్‌మెంట్ మీద కేసు వేసింది. ఇలాంటి కేసుల్లో అక్కడ 30 రోజుల్లోగా తీర్పు వెలువడుతుంది.

ఎం.ఊహ

'అమ్మా' అంటూ కుప్పకూలాడు. మళ్ళీ కాలులేపి మొఖంపై తన్నాడు. బరువైన బూటుతో బలంగా తన్నడంతో మొఖం పగిలిపోయింది. పెదవి చిట్లి రక్తం కారుతుంది. అయినా అతని మొఖంలో ఎలాంటి భయం లేదు.

'చెప్ప, ఎవడివి నువ్వు?' కుక్క మొరిగినట్టు సి.ఐ ప్రశ్న.

సార్, అతన్నేమనకండి. అతను స్కూలు టీచర్ సార్. మా ఊరి వాడేసార్. సర్పంచ్ రామయ్య ఆత్రుతగా చెప్పాడు.

"ఓహో! వీడు స్కూలు టీచరా!.......అరేయ్ టీచరువైతేందిరా!

మేమడిగితె జవాబు ఎందుకు చెప్పతలేవ్?"........చెప్పరా బిడ్డా నీ పేరేంది?" వెటకారంగా C.I ప్రశ్న.

'సార్ అతని పేరు ఎల్లేష్'.....సర్పంచ్ రామయ్య జవాబు.

అరేయ్ నేనడిగేది నిన్ను కాదురా! వాణ్ని. వాడినోట్లో ఏం పెట్టుకున్నాడు?

వాడెందుకు జవాబు చెప్పడు? అరేయ్ ఎల్లేష్ పంతుళ్ళు ప్రశ్నలేస్తరు. కాని జవాబులు చెప్పరారా? వెటకారంగా C.I ప్రశ్న.

'కాని మేము ఎవడితోనైనా జవాబు చెప్పిస్తం రా బిడ్డా' లే. లేచి బుద్ధిగా జవాబు చెప్ప' అంటూ కాలరు పట్టి లేపినిలెబ్టాడు.

ఎల్లేష్ చూపుల్లో ఏ మార్పులేదు.

C.I మొఖంలోకి సూటిగా చూస్తూ... 'చెబుతా మర్యాదగా........అడగవలసిన పద్ధతిలో ఎవరడిగినా జవాబు చెపుతా!

ఆ జవాబుతో పోలీసులు మరీ రెచ్చిపోయారు. C.I కోపంతో మరీ ఊగిపోయాడు. DSP జోక్యం చేసుకుంటూ, "ఓహో పంతులుకు మర్యాద చెయండిరా!" పంతులూ! ఏం చదివినవ్ పంతులు?" DSP వెటకారంగా అడిగినా ఎల్లేష్ మాట్లాడాలనుకున్నాడు.

"ఇంటర్మీడియట్"– ఎల్లేష్

మరి ఇంటర్‌మీడియట్ చదివే నువ్ పంతుల్లు ఎట్లైనవ్ పంతులూ? మళ్ళీ వెటకారంగా DSP.

ఎల్లేష్ ఏమీ మాట్లాడలేదు

"ఎక్కడి నుండి వస్తున్నవ్ పంతులూ?"

'జమ్మికుంటనుండి.' – ఎల్లేష్

జమ్మికుంట పోయిపోడివి గింతపొద్దుగాల ఎట్లొస్తవ్? C.I

'జమ్మికుంటకే పోయిన, రామకృష్ణ దగ్గరకు పోయిన?' ఎల్లేష్

'ఎందుకు పోయినట్లు?..... C.I

'ఊరి తొవ్వ గురించి మాట్లాడడానికి'.....ఎల్లేష్

'ఓహో గ్రామాల రాస్తావురా పంతులు?'

హేళనగా చేతులూపుతూ C.I మళ్ళీ 'మాచెవులో పూవులు పెట్టకు. తొవ్వ గురించి మీరేందిరా మాట్లాడేది? భలేగుందిరా నీ జవాబు.

మూడు నెలల నుండి ఇక్కడ తొవ్వ గురించి గొడవలు అవుతున్నాయి. దాని కోసమే మీరు మాట్లాడటానికి రామకృష్ణ అనే వాడి దగ్గరకు వెళ్ళావు. పొద్దుగాలనే లేచి వస్తున్నావు?' భలేగుంది నీ స్క్రిప్టు!!' పదం పదం సాగిదీస్తూ C.I చేతులూపుతూ అనాడు.

'అవును నిజం. మా వర్ల తొవ్వ ఒక సమస్యగా మారి రెండు గ్రామాల్లో అశాంతి ఏర్పడింది. ఈ సమస్యకు కారణాలను గురించి వివరాలను సేకరించినమ్. రేపు మేము ఈ రెండు గ్రామాల ప్రజల్ని కూర్చోబెట్టి నిజాలు బయటపెట్టి తొవ్వ గురించి జరిగే ఈ ఘర్షణలను నిలపెయ్యాలని అనుకున్నాము........'

'అవురా పంతులూ.........అవు..........' C.I

ఎల్లేష్ చెబుతున్న మాటలు వింటున్న సర్పంచు మొఖం కందగడ్డలా మారింది.

'ఒరేయ్ సర్పంచ్ వీడు చెప్పేది నిజమా?'

'ఎల్లేష్ మావూరి వాడే, మాదిగోల పిల్లగాడు. ఇంటర్ చదివి ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేస్తున్నాడు. తల్లిదండ్రులకు ఎదిగొచ్చినోడు........'

'అపరా నీ సొద. నేనడిగింది. తొవ్వ గురించి వీళ్ళు ఏదో ఎంక్వయిరీ చేసొట్లంట. గది నిజమా?' C.I

'ఏమో నాకు తెల్వదు సార్' – సర్పంచి.

(మిగతా వచ్చే వారం)



## డ్యూప్. ట్రిక్

హాలీవుడ్ స్టంట్‌మేన్ జోకపుట్ చేసే అరుదైన ఫీట్ ఇది. కేవలం ఓ మోచేతి మీదే తన శరీరం మొత్తాన్ని బేలన్స్ చేయగలడు. బేట్‌మేన్ IIIకి ఇతను, హీరోకి డ్యూప్‌గా పనిచే శాడు.

–ఎం.లిపి.